RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 232 | పేజీలు : 08 | మంగళవారం | 01-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

**ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..**
**రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్**

**వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు**

**తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ**

**రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ**

హైదరాబాద్ పల్స్,డెస్క్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు



## పుట్టింటి నుంచే బయటకు పంపారు..

**సభలో బోరున విలపించిన కవిత**

**బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత**

**సభలో కన్నీటి పర్యంతమైన కవిత**

**"కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు**

**కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత**

**తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన**

హైదరాబాద్ పల్స్,డెస్క్

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని

## రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి

# అభివృద్ధి చేస్తున్నాం



**రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం : రేవంత్ రెడ్డి**

**అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య హైలెవల్ బ్రిడ్జీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి - రూ.52కోట్ల నిధులతో 400 మీటర్ల వంతెన నిర్మాణం**

**నగరంలో ఏడాదిలోపు లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు కట్టించి ఆడబిడ్డలకు ఇస్తామని హామీ**

హైదరాబాద్ పల్స్,డెస్క్

విద్య, ఉపాధి అవకాశాలకు హైదరాబాద్ ఆశ్రయమిచ్చిందని, అన్ని పరిశ్రమలు హైదరాబాద్‌కు వచ్చినందునే అభివృద్ధి చెందుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య మూసీ నదిపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేటలోని స్పోర్ట్స్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఈ 400 మీటర్ల పొడవైన హైలెవల్ బ్రిడ్జిని రూ.52 కోట్ల నిధులతో నిర్మించారు. ఈ వంతెన ప్రారంభం కావడంతో చాదర్‌ఘాట్ వంతెనపై ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి.

**డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కట్టించారా?**

తెలంగాణ రైజింగ్ విజన్-2047 పాలసీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. మూసీ వరదల్లో కొట్టుకుపోయినా ఏ ప్రభుత్వం సహాయం చేయలేదని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు ఎందుకు వంతెన నిర్మించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన వచ్చిన రెండేళ్లలోనే బ్రిడ్జి నిర్మించి ప్రారంభించామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అంబర్‌పేట్‌లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కట్టించారా? అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టలేదని, ఇళ్లు కట్టినా పేదలకు ఇవ్వలేదని దళారులకు ఇచ్చారని ఆరోపించారు. విల్లాలు, ఫామ్‌హౌస్‌లు కట్టుకోలేదు

## అంకితం చేశామని

# డ్రామా ఆడారు

**వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు**

**మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం**

**నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు**

**గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ**

2

**2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ**

**నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి**



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ

## ఇరాన్ అధ్యక్షుడితో

# మోదీ భేటీ..

### యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు

**ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో మోదీ భేటీ**

2

**యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి సమావేశం**

**హర్మూజ్ జలసంధిపై చర్చ జరిగి ఉండొచ్చని అంచనా**

**ఇరాన్ యుద్ధం కోరుకోవడం లేదన్న పెజెష్కియాన్**

**అర్మేనియా ప్రధాని పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ**

హైదరాబాద్ పల్స్,డెస్క్

కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా ఇరువురు





## రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు

# స్వేచ్ఛ లేదా?



**కూనంనేని సంచలన వ్యాఖ్యలు**

**మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్న కూనంనేని**

**స్వేచ్ఛ లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరిక**

**సీఎంపై వ్యక్తిగత విమర్శలు సరికాదని కొండా సుస్మితకు సూచన**

**రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఉండాలన్న కూనంనేని**

**కోటి ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని వెల్లడి**

# తెలంగాణలో గోదావరి పుష్కరాలు

**రూ.1000 కోట్లతో ఘాట్‌ల అభివృద్ధి పనులు**

**వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలు**

**రూ.వెయ్యి కోట్లతో ఘాట్‌లను అభివృద్ధి చేస్తున్న అధికార యంత్రాంగం**

**పర్యాటకం, ఆధ్యాత్మిక సంచారానికి ప్రాధాన్యమిస్తున్న ప్రజలు**

2



## వివాదం లేకుండా రైతుకు భూమిని

# అప్పగించాలనేదే మా లక్ష్యం

**వివాదం లేకుండా రైతుకు భూమిని అప్పగించాలనేదే మా లక్ష్యం : మంత్రి పొంగులేటి**

**కేసముద్రంలో సబ్‌స్టేషన్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**తాము వచ్చాక భూ తగాదాలు అన్నీ పరిష్కరిస్తున్నామని వెల్లడి**

**సున్నా వడ్డీకి ఎంత మొత్తం ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్**

2



# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

మొదటి పేజీ రువాయి

గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు.వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు.మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు.నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# తెలంగాణలో గోదావరి పుష్కరాలు

మొదటి పేజీ రువాయి

గోదావరి పుష్కరాలకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఘాట్‌లను అభివృద్ధి చేసేందుకు రూ.వెయ్యి కోట్లతో ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రతువులో నీటిపారుదల శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. 2027, జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు ఘనంగా నిర్వహించే గోదావరి పుష్కరాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కోటి మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో మొత్తం అయిదు చోట్ల రూ.48.9 కోట్లతో స్నాన ఘాట్‌ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు మొదలయ్యాయి. రద్దీని అనుసరించి ఇంకా కొంత నిధితో తాత్కాలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. తొలి దశ పనుల కోసం ఇప్పటికే శంకుస్థాపన కార్యక్రమం పూర్తయింది. మిగతా పనులు త్వరలో ప్రారంభించి పుష్కరాలు జరిగే నెల రోజుల ముందు అందుబాటులోకి తేనున్నట్టు ఇంజినీరింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

పినపాక, అశ్వాపురం మండలాల్లో

2015లో జరిగిన పుష్కరాలతో పోల్చితే ప్రచార సమాచార వ్యవస్థ ఇప్పుడు చాలా వేగంగా పెరిగింది. అప్పటికంటే రోడ్లు, రవాణా మార్గాలు కూడా మెరుగయ్యాయి. కొవిడ్ ప్రభావంతో ఎక్కువ మంది లైఫ్ స్టైల్లో కూడా చాలా మార్పులు సంభవించాయి. టూరిజం, ఆధ్యాత్మిక సంచారానికి ఇప్పుడు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అశ్వాపురం మండలం చింతిర్యాల, పినపాక మండలం చింతలబయ్యారం గ్రామాల్లో గోదావరి నది వద్ద రూ.2.25 కోట్ల చొప్పున రూ.4.5 కోట్లతో నూతనంగా ఘాట్‌లను నిర్మించాలని ప్రతిపాదించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకుని వీటిని మంజూరు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరినట్లు ఆయా వర్గాలు తెలిపాయి. చర్ల మండలంలోను ఒక ఘాట్ ఉంటే జనాభా రద్దీ సమస్యను సులభంగా పరిష్కరించవచ్చని భావిస్తున్నారు.

భద్రాచలం కీలకం

బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఘాట్‌ల విశిష్టతను పరిశీలిస్తే ఇందులో భద్రాచలం అత్యంత కీలకం. రాములవారి దర్శనం కోసం వచ్చే భక్తులు పుష్కర స్నానం చేస్తారు. రోజుకి 4 లక్షల మంది భద్రాచలం ఘాట్‌కు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నా గతంలోని పుష్కరాల సమయంలోనే లోనే రోజుకు నాలుగైదు లక్షల చొప్పున జనాలు వచ్చారు.ఈ క్రమంలో తొక్కిసలాటకు అవకాశాలు లేని విధంగా కరకట్ట కింది భాగంలో రూ.కోటితో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సర్వీస్ రోడ్డును నిర్మించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. రూ.17.6 కోట్లతో జిల్లాలో పలుచోట్ల రోడ్లు, భవనాల శాఖ రోడ్లను నిర్మించేందుకు టెండర్‌లను ఫైనల్? చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు

# పుట్టింటి నుంచే బయటకు పంపారు..

మొదటి పేజీ రువాయి

కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు.కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు.తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు.ఏ తప్పు చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

# ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ..

మొదటి పేజీ రువాయి

నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి.ఇరువురు నేతలు ఏ అంశాలపై చర్చించారనే విషయం పూర్తిగా వెల్లడికాలేదు. అయితే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన దిగ్బంధం చర్చల్లో ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. కిర్గిజిస్థాన్ పర్యటన తొలి దశలో మోదీతో పెజెష్కియాన్ సమావేశమై చర్చలు జరిపినట్లు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది.బిష్కెక్ బయలుదేరే ముందు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. అయితే తమపై జరిగే దాడులకు బలంగా, దృఢంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో అస్థిరత అన్ని దేశాలకు నష్టమేనని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాల కోసం దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు.అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థికం, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు.తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలోనూ మోదీ పాల్గొననున్నారు.

# రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం

మొదటి పేజీ రువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువు లేకుండా బతుకమ్మకుంటను చెరబట్టారని విమర్శించారు. ఆక్రమణలు తొలగించి బతుకమ్మకుంటను మళ్లీ ఆడబిడ్డలకు బహుమతిగా ఇచ్చామని, దీనిని మళ్లీ చెరబట్టేందుకు సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బతుకమ్మకుంటను కబ్జా చేసిన సుధాకర్‌రెడ్డి వెనుక ఉన్నదెవరో ఆలోచించాలని కోరారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు తాము కట్టుకోలేదని వెల్లడించారు.



# అంకితం చేశామని డ్రామా ఆడారు

మొదటి పేజీ రువాయి

జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

అది మోదీతోనే సాధ్యం

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

# వివాదం లేకుండా రైతుకు భూమిని అప్పగించాలనేదే మా లక్ష్యం

మొదటి పేజీ రువాయి

తాము అధికారంలోకి వచ్చాక భూ తగాదాలు అన్నీ పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణిని బంగాళాఖాతంలో వేశామని, భూ భారతి తెచ్చామని వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో సబ్‌స్టేషన్ ప్రారంభించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.4.6 కోట్లతో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇనుగుర్తి, దంతాలపల్లి, సీరోలులో తహసీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీతక్క, వేం నరేందర్ రెడ్డి, బలరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లేనిపోని విమర్శలు చేస్తున్నారు

తుంగతుర్తి, కేసముద్రంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేటప్పుడు కులం, మతం, పార్టీ ఏమీ అడగమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామంలో ఓట్లే అడగమని తేల్చి చెప్పారు. అబద్ధాలరావు తమపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. తలకిందులుగా తపస్సు చేసినా ప్రజలు బీఆర్?ఎస్? నేతలను నమ్మరన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

వివాదం లేకుండా రైతుకు భూమిని అప్పగించాలనేదే తమ లక్ష్యమన్న పొంగులేటి శ్రీనివాస రెడ్డి, 125 ఏళ్లుగా తెలంగాణలో భూ సర్వే జరగలేదని తెలిపారు. ఎక్కడ కమీషన్లు వస్తాయో అక్కడే పదేళ్ల పాటు పని చేశారని ఆరోపించారు. సున్నా వడ్డీకి ఎంత మొత్తం ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, నిరుద్యోగ యువతకు అండగా ఉన్నామని, ఖాళీ పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకాన్ని పేదవాడి గుమ్మం వరకు చేరుస్తున్నామని, పదేళ్లు మీరేం చేశారో? వెయ్యి రోజుల్లో తాము ఏం చేశామో? ప్రజలే చెబుతారని పేర్కొన్నారు.

## నాచగిరి అభివృద్ధిని విస్మరించిన
# ప్రభుత్వాలకు స్వామివారి శాపమే

**రూ.100 కోట్ల మాస్టర్ ప్లాన్ సిద్ధమైనా నిధులు విడుదల చేయని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై యాదగిరి ముదిరాజ్ ధ్వజం**

**కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆలయ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే భక్తులు, ప్రజలతో కలిసి ఉద్యమం తప్పదని హెచ్చరిక**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, నాచగిరి, ఆగస్టు 31:**
తెలంగాణ లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి క్షేత్ర అభివృద్ధిని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని నాచగిరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం నాచగిరి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో ప్రాచీనమైన, విశిష్ట ప్రాముఖ్యత కలిగిన నాచగిరి క్షేత్రం రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్ర అభివృద్ధిపై ప్రభుత్వాలు శీతకన్ను వేయడం దురదృష్టకరమన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లతో నాచగిరి క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినప్పటికీ నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. అప్పటి ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఆలయ అభివృద్ధి, నిధుల విడుదల కోసం తాను పలుమార్లు ప్రయత్నించినప్పటికీ అప్పటి మంత్రులు, అధికారులు సహకరించలేదని తెలిపారు.నాచగిరిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని భావించినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకు ఆ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైందని వ్యాఖ్యానించారు. శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆగ్రహిస్తే ఎంతటి వారైనా పతనం తప్పదని అన్నారు.అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నాచగిరి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంలో చొరవ




చూపడం లేదని ఆరోపించారు. మాటలకే పరిమితం కాకుండా ఆలయ అభివృద్ధికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఆలయ ఆస్తులను పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. నాచగిరి క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు, ప్రజలను చైతన్యపరిచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రతి వార్డును అభివృద్ధికి
# ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే జీఎంఆర్

**ఇస్నాపూర్ మున్సిపాలిటీలో రూ.3.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం..**

**నాణ్యతతో వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31:**
ఇస్నాపూర్ మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇస్నాపూర్, చిట్కుల్, లకడారం వార్డుల్లో రూ.3 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, మురుగునీటి కాలువలు, పారిశుద్ధ్యం తదితర రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఒక్క



ప్రాంతానికే పరిమితం కాకుండా మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**నాణ్యతతో వేగంగా పనులు**

శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, పాండు, నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, సంధ్య నవీన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, ఈశ్వరమ్మ, జనార్ధన్ రెడ్డి, ఆంజనేయులు, మమత అరుణ్, రాజు, లత వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సోనియా రాజు, నిజాముద్దీన్ బాబా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మేరాజ్ ఖాన్, కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ రైల్వే అభివృద్ధికి భారీ నిధులు..కవచ్ వ్యవస్థ విస్తరణపై దృష్టి

**మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల పరిశీలన**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, తెలంగాణ డెస్క్, ఆగస్టు 31:**
తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను ఎంపీ డీకే అరుణతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌ను భవిష్యత్తులో కీలక రైల్వే కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**42 రైల్వే స్టేషన్ల అభివృద్ధి**

తెలంగాణలో ఏకకాలంలో 42 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. దేశంలోని రైల్వే స్టేషన్లను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**రూ.5,454 కోట్ల కేటాయింపులు**

2026-27 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రైల్వే అభివృద్ధికి రూ.5,454 కోట్లను కేటాయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. కొత్త రైల్వే మార్గాల నిర్మాణంతో పాటు ఇప్పటికే ఉన్న మార్గాల ఆధునికీకరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు.

**తెలంగాణకు మూడు వేగవంత రైలు మార్గాలు**

దేశంలో ప్రతిపాదించిన వేగవంతమైన రైలు మార్గాల ప్రణాళికలో తెలంగాణకు మూడు ప్రాజెక్టులు కేటాయించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. వీటి ద్వారా రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.

**రైలు భద్రతకు కవచ్ వ్యవస్థ**

రైలు ప్రమాదాల నివారణ కోసం అభివృద్ధి చేసిన స్వదేశీ స్వయంచాలక రైలు రక్షణ వ్యవస్థ కవచ్ అమలుపై కూడా కేంద్రం దృష్టి సారించిందని



తెలిపారు. రైళ్ల రాకపోకలను మరింత సురక్షితంగా నిర్వహించడంతో పాటు ప్రమాదాల అవకాశాలను తగ్గించడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.తెలంగాణలో రైల్వే రంగాన్ని మరింత విస్తరించి, ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కిషన్‌రెడ్డి తెలిపారు.

# చంద్రశేఖర్ స్వామి భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో శ్రీ చండిక సోమేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు గౌండ్ల మఠం చంద్రశేఖర్ స్వామి అనారోగ్యంతో మృతిచెందగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిఆర్9 టీవీ సిఎండి తూర్పు రమేష్, ఆలేరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ కుడుదుల నగేష్, బూడిద బిక్షమయ్య గౌడ్, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, ఆలేరు మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, ఆలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంధమల్ల అశోక్, గ్రామ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ - వెంకటేష్, ఉపసర్పంచ్ గొట్టం విజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ పార్టీ నాయకులు, గౌడ సంఘం అధ్యక్షులు మాసాపేట రాజు గౌడ్, గౌడ సంఘం పాలకవర్గం, గ్రామంలోని అఖిలపక్ష నాయకులు వారి కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలిపారు.



# 4న శ్యామ్ దర్బార్..!

**కృష్ణాష్టమి వేడుకల గోడపత్రిక ఆవిష్కరణ**

**పలు ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి కళాకారుల సంగీత ప్రదర్శనలు**




**ఝరాసంగం, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31:**
ఈనెల 4న కృష్ణాష్టమి సందర్భంగా ఝరాసంగం మండలం ఏడాకులపల్లి గ్రామంలో వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, కీర్తనలు, ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు శ్యామ్ దర్బార్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను సోమవారం బర్ధిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు.శ్యామ్ దర్బార్‌లో పుణెకు చెందిన తబలా కళాకారుడు పాండురంగ పవార్, కొల్హాపూర్‌కు చెందిన హిందుస్థానీ గాయకుడు అర్నవ్ బువా, హైదరాబాద్‌కు చెందిన హిందుస్థానీ గాయని ఆరాధనా కర్వాడే సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.అలాగే తబలా కళాకారుడు ఉస్తాద్ నిజాముద్దీన్ జావేద్, సితార్ కళాకారుడు నందు కుమార్, బీదర్--తాడ్లాపూర్‌కు చెందిన దత్తు మహారాజ్, నిజామాబాద్‌కు చెందిన తబలా కళాకారుడు శంకర్ సింగ్ కూడా తమ కళా ప్రదర్శనలతో భక్తులను అలరించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.కృష్ణాష్టమి వేడుకలు, శ్యామ్ దర్బార్‌ను విజయవంతం చేసేందుకు భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# జాతీయ స్థాయి కబడ్డీ న్యాయ నిర్ణేతగా రాథోడ్ శ్రీనివాస్

**ఏకేఎఫ్ఐ నిర్వహించిన జాతీయ న్యాయ నిర్ణేత పరీక్షలో ఉత్తీర్ణత**

**కర్ధనూరు వ్యాయామ ఉపాధ్యాయుడికి అరుదైన ఘనత**

**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31:**
కర్ధనూరుకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు రాథోడ్ శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో ఏకేఎఫ్ఐ నిర్వహించిన జాతీయ స్థాయి న్యాయ నిర్ణేత పరీక్షలో ఆయన ఉత్తీర్ణత సాధించారు. దీంతో జాతీయ స్థాయి కబడ్డీ న్యాయ నిర్ణేతగా అర్హత పొందారు.కబడ్డీ క్రీడలో కోచ్‌గా సేవలందిస్తూ జాతీయ స్థాయి న్యాయ నిర్ణేతగా అర్హత సాధించడం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో రాథోడ్ శ్రీనివాస్ మరిన్ని ఉన్నత స్థాయిలకు చేరుకుని ప్రో కబడ్డీ లీగ్‌తో పాటు అంతర్జాతీయ క్రీడా వేదికలపై కూడా సేవలందించాలని వారు ఆకాంక్షించారు.



# బుదేరా సాంఘిక సంక్షేమ వసతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

**కళాశాల నిర్వహణలో లోపాలు, విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంపై చర్యలు**

**సంగారెడ్డి, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
మునిపల్లి మండలం బుదేరాలోని సాంఘిక సంక్షేమ వసతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.కళాశాల నిర్వహణలో లోపాలు, పరిపాలనా వ్యవహారాల్లో నిర్లక్ష్యం, నిర్వహణ సక్రమంగా లేకపోవడం, విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరుపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రామాచారి, జిల్లా సమన్వయకర్త కల్పన బుదేరా కళాశాలను సందర్శించారు. కళాశాల నిర్వహణ, పరిపాలనా అంశాలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు తదితర విషయాలను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు.నివేదికలో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం ప్రిన్సిపాల్ పి. శైలజ నిర్లక్ష్య ధోరణి, కళాశాల నిర్వహణలో లోపాలు, విద్యార్థినుల పట్ల తగిన విధంగా వ్యవహరించకపోవడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వసతి కళాశాలల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు.



# క్రీడలతోనే దారుఢ్యం.. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం

**అండర్-19 కళాశాలల 70వ క్రీడా పోటీలను ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

సికింద్రాబాద్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి): క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జింఖానా మైదానంలో నిర్వహిస్తున్న అండర్-19 కళాశాలల 70వ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16 నుంచి 19 ఏళ్ల వయస్సు యువత జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలు వారి భవిష్యత్తును నిర్దేశిస్తాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఏకాగ్రత పెరిగి చదువులోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. క్రీడల్లో సాధించిన ప్రతిభా ధ్రువపత్రాలు ఉన్నత విద్య ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటా ద్వారా ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడా వసతుల అభివృద్ధికి చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని యువత, క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు క్రీడా మైదానాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ కళాశాలలకు,






కంటోన్మెంట్ నియోజకవర్గానికి, హైదరాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# 7.8 శాతం వృద్ధి అద్భుతం.. భారత ఆర్థిక వ్యవస్థపై మోదీ ప్రశంసలు

**ప్రపంచ అనిశ్చితుల మధ్య దేశ ప్రజల సమిష్టి శక్తితో ఘన విజయం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,న్యూఢిల్లీ, ఆగస్టు 31:**
2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం స్థూల దేశీయోత్పత్తి వృద్ధిని నమోదు చేయడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు, చమురు ధరల ప్రభావం, సరఫరా వ్యవస్థలో అంతరాయాల మధ్య ఈ స్థాయి వృద్ధిని సాధించడం అసాధారణ విజయమని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించిన మోదీ, దేశ ప్రజల సమిష్టి శక్తే ఈ విజయానికి కారణమని తెలిపారు. భారత్‌పై అనుమానాలు వ్యక్తం చేసిన వారి అంచనాలను దేశ ఆర్థిక వ్యవస్థ



తారుమారు చేసిందని వ్యాఖ్యానించారు.

**ఏప్రిల్-జూన్‌లో 7.8 శాతం వృద్ధి**

2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి చెందింది. అంతర్జాతీయ పరిణామాలు ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతాయనే అంచనాలు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వృద్ధి బలంగా నమోదైంది. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో నమోదైన 8.6 శాతం వృద్ధితో పోలిస్తే తాజా వృద్ధి కొంత తగ్గింది. గత త్రైమాసికంతో పోల్చితే సుమారు 80 బేసిస్ పాయింట్ల తగ్గుదల నమోదైంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ భారత్ బలమైన వృద్ధి రేటును కొనసాగించడం దేశ ఆర్థిక వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనమని ఆర్థిక రంగ వర్గాలు భావిస్తున్నాయి.

# ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ

**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల వేళ ఎస్సీఓ సదస్సులో సమావేశం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, సెంట్రల్ బ్యూరో :**
పశ్చిమాసియాలో అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కీలక సమావేశం నిర్వహించారు. కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరు దేశాధినేతలు భేటీ అయ్యారు. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ పరిస్థితులు ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖి సమావేశం కావడం ఇదే తొలిసారిగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరు నేతల మధ్య జరిగిన చర్చల పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు. అయితే ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి పరిస్థితులు, పశ్చిమాసియాలో



నెలకొన్న ఉద్రిక్తతలపై చర్చ జరిగి ఉండవచ్చని సమాచారం. హార్మూజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు ప్రపంచ సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి.

**శాంతియుత పరిష్కారమే భారత్ వైఖరి**

అమెరికా-ఇరాన్ మధ్య విభేదాలను చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని భారత్ గతం నుంచి కోరుతోంది. పశ్చిమాసియాలో సుస్థిరత కొనసాగాలని, ప్రపంచ వాణిజ్యం, సరఫరా వ్యవస్థలకు ఆటంకాలు ఏర్పడకూడదని భారత్ తన వైఖరిని స్పష్టం చేస్తోంది. ఇరాన్‌లో ఉన్న భారతీయుల భద్రత విషయంలో ఆ దేశ ప్రభుత్వ సహకారానికి ప్రధాని మోదీ గతంలో కృతజ్ఞతలు తెలిపారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న సమస్యలను శాంతియుత చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన పునరుద్ఘాటించారు. తాజా పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియా పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీకి అంతర్జాతీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

## విశ్వరహస్యాల ఛేదనకు రోమన్ టెలిస్కోప్..

# డార్క్ ఎనర్జీపై నాసా కొత్త పరిశోధనలు

**హబుల్ కంటే విస్తృత పరిశీలన.. బాహ్యగ్రహాల అన్వేషణపై ప్రత్యేక దృష్టి**


**హైదరాబాద్ పల్స్ న్యూస్,వాషింగ్టన్, ఆగస్టు 31:**
విశ్వంలో దాగి ఉన్న అనేక రహస్యాలను ఛేదించే లక్ష్యంతో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రతిష్ఠాత్మక నాన్సీ గ్రేస్ రోమన్ అంతరిక్ష టెలిస్కోప్ ప్రాజెక్టును చేపట్టింది. డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీతో పాటు సౌర కుటుంబం వెలుపల ఉన్న గ్రహాలపై విస్తృత పరిశోధనలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త నాన్సీ గ్రేస్ రోమన్ జ్ఞాపకార్థం ఈ టెలిస్కోప్‌కు ఆమె పేరు పెట్టారు. ఆమెను హబుల్ టెలిస్కోప్ కార్యక్రమానికి చేసిన సేవల కారణంగా 'మదర్ ఆఫ్ హబుల్'గా కూడా గుర్తిస్తారు. రోమన్ టెలిస్కోప్ ద్వారా ఒకేసారి విస్తృతమైన అంతరిక్ష ప్రాంతాన్ని పరిశీలించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. హబుల్ టెలిస్కోప్‌తో పోలిస్తే చాలా వేగంగా ఖగోళ సమాచారాన్ని సేకరించి విశ్వంలోని మార్పులను అధ్యయనం చేయడానికి ఇది ఉపయోగపడనుంది.

**డార్క్ ఎనర్జీపై ప్రత్యేక పరిశోధనలు**

విశ్వ విస్తరణ వెనుక ఉన్న డార్క్ ఎనర్జీ, కంటికి కనిపించని డార్క్ మ్యాటర్ స్వభావాన్ని అర్థం చేసుకోవడం ఈ పరిశోధనలో ప్రధాన అంశంగా ఉంది. విశ్వం ఎలా ఏర్పడింది, కాలక్రమంలో అది ఎలా విస్తరిస్తోంది వంటి ప్రశ్నలకు మరింత స్పష్టమైన సమాధానాలు లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే ఇతర నక్షత్రాల చుట్టూ తిరుగుతున్న బాహ్యగ్రహాలను గుర్తించడం, వాటి స్వభావాన్ని అధ్యయనం చేయడంలో కూడా ఈ టెలిస్కోప్ కీలక పాత్ర పోషించనుంది.

**ప్రత్యేక పరికరాలతో పరిశీలనలు**


నక్షత్రాల కాంతిని నియంత్రించి వాటి సమీపంలోని చిన్న గ్రహాలను స్పష్టంగా పరిశీలించేందుకు ప్రత్యేక కరోనాగ్రాఫ్ పరికరాన్ని ఇందులో అమర్చినట్లు సమాచారం. దీని ద్వారా ఇప్పటివరకు స్పష్టంగా పరిశీలించడం కష్టమైన కొన్ని ఖగోళ వస్తువులపై మరింత అధ్యయనం చేసే అవకాశం ఉంటుంది. పలు సవాళ్లు, బడ్జెట్ సమస్యల మధ్య సంవత్సరాలుగా కొనసాగిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఇప్పుడు అంతరిక్ష పరిశోధనలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. రోమన్ టెలిస్కోప్ పరిశోధనల ద్వారా రాబోయే సంవత్సరాల్లో విశ్వ రహస్యాలకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# నర్సుపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడు సనావుల్లా ఖాన్ అరెస్ట్


**సీసీటీవీ, శాస్త్రీయ ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న పహాడీషరీఫ్ పోలీసులు**





**తుక్కుగూడ, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
తుక్కుగూడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న 21 ఏళ్ల నర్సుపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన కేసులో ఎం.డి. సనావుల్లా ఖాన్ (34)ను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. బిహార్‌కు చెందిన సనావుల్లా ఖాన్ తుక్కుగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆస్పత్రి సమీపంలోని మెకానిక్ దుకాణంలోనే నివాసం ఉంటున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సుమారు నెల రోజులుగా నర్సు కదలికలను గమనిస్తున్న నిందితుడు ఆగస్టు 28--29 అర్ధరాత్రి సమయంలో కిటికీ ద్వారా ఆమె గదిలోకి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని నర్సు ప్రతిఘటించడంతో ఆమె గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. పెనుగులాట సందర్భంగా మృతురాలు నిందితుడి వేలిని కొరికడంతో పాటు, గొంతు, ఛాతీపై గోళ్లతో గాయపరిచినట్లు పోలీసులు గుర్తించారు. హత్య అనంతరం మృతురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కిటికీ మూసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. జాగిలం ఆస్పత్రి సమీపంలోని మెకానిక్ దుకాణం వద్ద ఆగడంతో పోలీసులకు అనుమానం కలిగింది. దీంతో సనావుల్లాను అదుపులోకి తీసుకుని విచారించగా నేరానికి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# ప్రజావాణిలో రెండు వినతులు స్వీకరణ





**కొంపల్లి, ఆగస్టు 31(హైదరాబాద్ ఫల్స్ ప్రతినిధి):**
కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం రెండు వినతి పత్రాలు అందాయి. వీధి దీపాలు పనిచేయకపోవడంతో వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని ఒకరు వినతి సమర్పించారు. అలాగే ఇంటి నంబర్ 29-96కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌ను తొలగించాలని మరో వినతి అందింది. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యలను త్వరితగతిన పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ఆదేశించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

# శంభు లింగేశ్వర స్వామి దర్శనానికి భక్తుల రద్దీ

**శ్రావణ సోమవారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు**

**వర్గల్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
వర్గల్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ, అతి పురాతన శైవ క్షేత్రమైన అన్నపూర్ణ సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు మాట్లాడుతూ, శంభు లింగేశ్వర స్వామి దేవాలయం అత్యంత పురాతనమైన క్షేత్రమని తెలిపారు. కాశీ క్షేత్రాన్ని తలపించే విశిష్టత కలిగిన ఈ మహా క్షేత్రంలో ప్రతి సంవత్సరం శ్రావణ, కార్తీక, మాఘ మాసాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు పవిత్ర మాసాల్లో విశేష పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తమ కోరికలు, సంకల్పాలు నెరవేరాలని కోరుతూ భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



# ఫీజుల బకాయిల కోసం బీజేపీ పోరాటం

**నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్**




**హైదరాబాద్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** తెలంగాణ బీజేపీ పిలుపు మేరకు ఫీజు బకాయిల విడుదల కోసం నిర్వహించిన బీజేపీ పోరాట కార్యక్రమంలో కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ పాల్గొన్నారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి చేపట్టిన నిరసన కార్యక్రమంలో కొంపల్లి డివిజన్ నాయకులతో కలిసి పాల్గొని సంఘీభావం తెలిపారు.రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు సుమారు రూ.15 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని సతీష్ సాగర్ ఆరోపించారు. బకాయి నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.గత, ప్రస్తుత ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాలు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాలను మోసం చేశాయని విమర్శించారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు, నాయకులకు సతీష్ సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

# పీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడించిన ట్రైడెంట్ షుగర్స్ కార్మికులు

**పెండింగ్ పీఎఫ్ నగదు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్.**




**జహీరాబాద్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూరు (బి) గ్రామ శివారులోని ట్రైడెంట్ చక్కెర పరిశ్రమ కార్మికులు సోమవారం పటాన్‌చెరులోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయాన్ని ముట్టడించారు.ఉదయం పరిశ్రమ ప్రధాన ద్వారం నుంచి డీసీఎం వాహనాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు పటాన్‌చెరు పీఎఫ్ కార్యాలయానికి చేరుకున్నారు. ట్రైడెంట్ షుగర్స్ యాజమాన్యం పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ నగదును చెల్లించి సంవత్సరం గడుస్తున్నప్పటికీ, కార్మికుల పీఎఫ్ ఖాతాల్లో నగదు జమ చేయడంలో కార్యాలయ సిబ్బంది జాప్యం చేస్తున్నారని కార్మికులు ఆరోపించారు.ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ నగదును వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు.

# స్థానిక సమస్యలు పరిష్కరించాలి

**ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించాలని సీపీఎం డిమాండ్**



**నారాయణఖేడ్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నారాయణఖేడ్ మండలంలోని గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాలకు సరైన రహదారి సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు, ఇప్పటికే మంజూరైన వంతెనల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.గ్రామాల్లో కొత్తగా నిర్మించిన ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి, అవసరమైన పట్టాలు మంజూరు చేయాలని అన్నారు. కొత్త ఇళ్లకు ఇంటి పన్ను వసూలు చేస్తున్నప్పటికీ, ఇంటి నంబర్లు, ఇతర హక్కు పత్రాల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు కొనసాగుతున్నాయని ఆరోపించారు. గుంటల వారీగా స్థలాలను నమోదు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుంటలు, ప్లాట్లు అంటూ రెండు రకాలుగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటి అక్రమాలపై చర్యలు తీసుకుని గుంటల వారీగా నమోదులను అరికట్టాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు నర్సింలు, స్వరాజ్, సుబ్బు, రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి జ్ఞాన మందిరంలో ఫలార్చన పూజ కార్యక్రమం

**రకరకాల పండ్లతో స్వామి వారికీ ప్రత్యేక పూజలు**

**ఆగస్టు 31, స్వర్ణదామా నగర్**

**(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సికింద్రాబాద్ పరిధిలోని ఓల్డ్ బోయినపల్లి డివిజన్ లోని స్వర్ణ దామా నగర్ లోని గాయత్రీ జ్ఞాన మందిరంలో శ్రావణ మాసం సందర్బంగా సిద్ధి మహా కాళేశ్వర్ స్వామి వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో మొదటి సోమవారం లక్ష బిల్వార్చన పూజ, రెండవ సోమవారం, మూడవ రోజు పండ్లతో ఫలార్చన పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. పండ్లతో దేవునికి చేసే పూజ లేదా అర్చనను ఫలార్చన అంటారు. పూజలో ఉపయోగించే పండ్ల రకాలను బట్టి దీనిని వేర్వేరు పేర్లతో కూడా పిలుస్తారు.కదళీ ఫలార్చన అంటే అరటిపండ్లతో (సంస్కృతంలో కదళీ అంటే అరటి) చేసే అర్చన. చూత ఫలార్చన అంటే మామిడిపండ్లతో చేసే అర్చన. నారికేళ ఫలార్చన అంటే కొబ్బరికాయలతో చేసే అర్చన. దేవునికి ఇష్టమైన రకరకాల పండ్లను సమర్పించి, అష్టోత్తర శతనామాలు (108) లేదా సహస్రనామాలు (1000) చదువుతూ ఈ విశేష పూజను నిర్వహిస్తారు.ఈ సందర్బంగా ఆలయ కమిటీ,పూజారులు మాట్లాడుతూ శ్రీ సిద్ధి మహా కాళేశ్వర్ స్వామి వారి అనుగ్రహం కరుణ కటాక్షాలు కలగాలని ప్రజలందరు, భక్తులందరు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో, ఐశ్వర్యం, శాంతి కలగాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి జ్ఞాన మందిరం పూజారులు రాజేశ్వర్, శైలేంద్ర, శ్రీవాణి మేడమ్ మధుసూదన్ రెడ్డి, జంజీరాల సురేష్, లక్ష్మీ ప్రసాద్, లింగం, సుజిత్ రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, రాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# లోటస్ ఫార్మ్‌ల్యాండ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

**అనుమతులపై స్పష్టత వచ్చే వరకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని తహశీల్దార్‌కు బీఎస్పీ నేత వినతి**

**నారాయణఖేడ్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామ పరిధిలోని లోటస్ ఫార్మ్‌ల్యాండ్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, అవసరమైన అనుమతులపై స్పష్టత వచ్చే వరకు రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేయాలని బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షుడు అనుముల తుకారాం కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.సుమారు 50 ఎకరాల్లో గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుగా ప్రచారం చేస్తూ, రూ.18 లక్షలకు 1,210 గజాల ప్లాట్‌తో పాటు ఒక పడకగది ఫార్మ్‌హౌస్, మహోగని తదితర మొక్కలు, రిసార్ట్, వారాంతపు నివాసం, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని ప్రచారం చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ప్రచారానికి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.ప్రాజెక్టులోని కొంత భూమి గుట్టలపై ఉన్నట్లు, సరైన రహదారి సౌకర్యం లేదని, ప్రాజెక్టుకు చేరుకోవడానికి వాగు దాటాల్సిన పరిస్థితి ఉందని స్థానికుల నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు. వర్షాకాలంలో వాగు ప్రవాహం



కారణంగా రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అనుమతులపై స్పష్టత ఇవ్వాలి**

సదరు భూమి స్వరూపం, వినియోగం, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని తుకారాం కోరారు. ఫార్మ్‌ల్యాండ్ పేరుతో భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.రిసార్ట్, వారాంతపు నివాసాలు, స్విమ్మింగ్ పూల్ తదితర నిర్మాణాలకు సంబంధిత శాఖల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొందారా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు. గుట్టలను తవ్వి రహదారులు ఏర్పాటు చేసినట్లయితే అందుకు అనుమతులు ఉన్నాయా, ప్రాజెక్టుకు సరైన రహదారి, రాకపోకలు, ఇతర మౌలిక వసతులు ఉన్నాయా అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు ఇచ్చే ప్రకటనలు, ప్రచార పత్రికల్లో పేర్కొంటున్న హామీలు వాస్తవాలకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని కూడా అధికారులు నిర్ధారించాలని తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు ప్రజలకు నష్టం కలగకుండా ఫార్మ్‌ల్యాండ్ పేరుతో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని తహశీల్దార్‌ను కోరారు.నిబంధనలకు విరుద్ధంగా భూమి విక్రయాలు లేదా నిర్మాణాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనుముల తుకారాం విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ ఫేజ్-2పై బీఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ

**ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సూచన**

**నారాయణఖేడ్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫేజ్--2 ప్రక్రియపై బీఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.గాంధీభవన్ నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్, ఎస్ఐఆర్ సమన్వయకర్త మాణిక్యం మల్లేష్ యాదవ్ బీఎల్ఏలకు ఎస్ఐఆర్ ఫేజ్--2లో చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు. తమ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించడం, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి జాబితాలో నమోదు చేయించడం, అవసరమైన సవరణలు చేయించడం, ఓటర్ల వివరాలను పరిశీలించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో ఓటరు జాబితాను బాధ్యతగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా



సమర్థవంతంగా పూర్తి చేయడానికి ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో నియోజకవర్గంలోని బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణులారా..బీఆర్ఎస్‌కు ధీటైన జవాబివ్వాలి

**వెయ్యి రోజుల ప్రజా పాలనపై ప్రతిపక్షం చేస్తున్న ప్రచారాన్ని ప్రజల్లో తిప్పికొట్టాలని పిలుపు**

**కేసీఆర్ అసెంబ్లీ చర్చల్లో పాల్గొనలేదని విమర్శించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల ప్రజా పాలనపై బీఆర్ఎస్ చేపడుతున్న వారం రోజుల కార్యక్రమాలకు కాంగ్రెస్ శ్రేణులు ధీటైన జవాబు ఇవ్వాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.కేసీఆర్ పదేళ్లపాటు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల భారంలోకి నెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్నప్పటికీ అసెంబ్లీ చర్చల్లో పాల్గొనడం లేదని విమర్శించారు.వెయ్యి రోజులుగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ ఒక్కరోజు కూడా అసెంబ్లీ చర్చల్లో పాల్గొనలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడి పదవిని కూడా సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు.బీఆర్ఎస్‌లోని దళిత ఎమ్మెల్యేకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాంటి అవకాశం కల్పించిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై విమర్శించే నైతిక అర్హత ఉంటుందని వ్యాఖ్యానించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. 2014, 2018 ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ఇచ్చిన హామీల అమలు, రాష్ట్ర ఆర్థిక



పరిస్థితిపై ప్రజల్లో చర్చ జరగాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజా పాలన కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు చామల కిరణ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మోటార్ల రాగి వైర్లపై దొంగల కన్ను

**ఒకేరోజు ఐదుగురు రైతుల మోటార్లకు చోరీ..**
**పంచాయతీ బావి మోటార్ వైరు కూడా మాయం**

**హైదరాబాద్ పల్స్ ఆగస్టు 31, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామంలో వ్యవసాయ మోటార్ల రాగి వైర్ల చోరీలు రైతులను కలవరపెడుతున్నాయి. ఆకేరు వాగు పరిసరాల్లోని వ్యవసాయ మోటార్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుసగా చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు తెలిపారు. ఆదివారం ఐదుగురు రైతులకు చెందిన మోటార్ల రాగి వైర్లు చోరీకి గురికాగా, గ్రామ పంచాయతీ బావి మోటార్‌కు సంబంధించిన రాగి వైరు కూడా దొంగలపాలైంది. ఈ



సందర్భంగా రైతు శోభన్‌బాబు మాట్లాడుతూ.. ఆకేరు వాగు పరిసరాల్లో మోటార్ల రాగి వైర్ల చోరీలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో పలుమార్లు చోరీలు జరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మోటార్ల వైర్లు చోరీ కావడంతో పంటలకు నీరందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని తిరిగి కొనుగోలు చేసేందుకు రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. చోరీలు పెరగడంతో రాత్రివేళల్లో మోటార్ల వద్దే కాపలా ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని శోభన్‌బాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు చోరీకి గురైన రాగి వైర్ల విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చోరీలకు పాల్పడుతున్న వారిని త్వరగా గుర్తించాలని కోరారు. ఆకేరు వాగు పరిసరాల్లో రాత్రి గస్తీ పెంచి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సింధు జలాల వివాదంపై అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు..భారత్ తిరస్కరణ

**సింధు జలాల ఒప్పందం నిలిపివేత**
**కొనసాగుతుందని విదేశాంగ శాఖ స్పష్టీకరణ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, ఆగస్టు 31:** సింధు జలాల ఒప్పందానికి సంబంధించిన వివాదంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానం ఇచ్చిన తాజా తాత్కాలిక తీర్పును భారత్ తిరస్కరించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం కొనసాగుతుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.భారత్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పాకిస్తాన్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం తాజాగా తాత్కాలిక తీర్పు వెలువరించినట్లు సమాచారం. అయితే, భారత్ ఈ న్యాయస్థాన అధికార పరిధినే గుర్తించబోమని స్పష్టం చేసింది.భారత్ తీసుకున్న సార్వభౌమ నిర్ణయాలపై తీర్పులు ఇచ్చే అధికారం ఈ న్యాయస్థానానికి లేదని



విదేశాంగ శాఖ పేర్కొంది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నిర్ణయం అమల్లోనే ఉందని తెలిపింది.ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ వ్యవస్థను ఏర్పాటు చేసిందని భారత్ గతం నుంచే అభ్యంతరం వ్యక్తం చేస్తోందని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ సంస్థ ఏర్పాటు చట్టబద్ధతను భారత్ ఎన్నడూ అంగీకరించలేదని స్పష్టం చేసింది.ఈ మధ్యవర్తిత్వ సంస్థ ముందు భారత్ ఎప్పుడూ హాజరుకాలేదని, గతంలో వెలువడిన ప్రకటనలు, తీర్పులను కూడా గుర్తించలేదని తెలిపింది. తాజాగా వెలువడిన తీర్పును కూడా అదే విధంగా తిరస్కరిస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది.సింధు జలాల వివాదంలో భారత్, పాకిస్తాన్ మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# హైదరాబాద్ నుంచి ఒకే యాత్రలో ఏడు జ్యోతిర్లింగాల దర్శనం

**సెప్టెంబర్ 23 నుంచి ప్రత్యేక రైలు యాత్ర.. రూ.18 వేల నుంచి ప్రయాణ చార్జీ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, తెలంగాణ బ్యూరో:** ఒకే యాత్రలో ఏడు ప్రముఖ జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర పేరుతో ప్రత్యేక పర్యటనను నిర్వహించనున్నారు.ఈ యాత్ర సెప్టెంబర్ 23న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభం కానుంది. భారత్ గౌరవ్ పర్యాటక రైలు ఉదయం 8 గంటలకు బయలుదేరనుంది. సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్ఖేడ్, నాందేడ్, పూర్ణ జంక్షన్‌ల మీదుగా రైలు ప్రయాణం సాగనుంది.ఈ యాత్రలో ఉజ్జయినిలోని మహాకాళేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, ద్వారక




సమీపంలోని నాగేశ్వరుడు, సోమనాథుడు, మహారాష్ట్రలోని భీమశంకరుడు, త్రయంబకేశ్వరుడు, ఘృష్ణేశ్వరుడు ఆలయాలను సందర్శించేలా కార్యక్రమం రూపొందించారు.సెప్టెంబర్ 24న ఉజ్జయిని చేరుకుని మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం ఓంకారేశ్వర, నాగేశ్వర, సోమనాథ, భీమశంకర, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రాల సందర్శన కొనసాగుతుంది. అక్టోబర్ 2న ఘృష్ణేశ్వర ఆలయ దర్శనంతో సప్త జ్యోతిర్లింగ యాత్ర ముగుస్తుంది.మొత్తం 10 రాత్రులు, 11 రోజుల పాటు ఈ యాత్ర సాగనుంది. అక్టోబర్ 3న ప్రయాణికులు తిరిగి సికింద్రాబాద్‌కు చేరుకుంటారు. ఈ పర్యటనకు ఆర్థిక తరగతి టికెట్ ధర రూ.18 వేల నుంచి ప్రారంభమవుతుందని సమాచారం.యాత్రపై ఆసక్తి ఉన్న భక్తులు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ పర్యాటక సేవల ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని టికెట్లు పొందవచ్చు.

# చైనా, పాక్ ట్యాంకులకు చెక్ పెట్టేందుకు భారత్ మాస్టర్ ప్లాన్!

**జావెలిన్ క్షిపణులతో ట్యాంకులకు చెక్.. భారత్‌కు అమెరికా నుంచి అత్యాధునిక ఆయుధాలు**

**అత్యవసర కొనుగోలు కింద ఒప్పందం.. సరిహద్దు రక్షణ సామర్థ్యం పెంపుపై దృష్టి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,న్యూఢిల్లీ, ఆగస్టు 31:** సరిహద్దుల్లో రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ కీలక అడుగు వేసింది. అమెరికా తయారీ అత్యాధునిక జావెలిన్ యాంటీ ట్యాంక్ మార్గదర్శక క్షిపణుల కొనుగోలుకు భారత సైన్యం చర్యలు చేపట్టింది. అత్యవసర కొనుగోలు విధానం కింద ఈ ఒప్పందం ముందుకు సాగుతున్నట్లు సమాచారం.ఈ ఒప్పందంలో పరిమిత సంఖ్యలో జావెలిన్ క్షిపణులతో పాటు వాటిని ప్రయోగించేందుకు అవసరమైన కమాండ్ లాంచ్ యూనిట్లు కూడా ఉండనున్నాయి. ఒప్పందం విలువ సుమారు రూ.292 కోట్లుగా ఉన్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి.

**'ప్రయోగించి వదిలే' సాంకేతికత ప్రత్యేకత**

జావెలిన్ క్షిపణి వ్యవస్థలో ప్రధాన ప్రత్యేకత 'ఫైర్ అండ్ ఫర్గెట్' సాంకేతికత. లక్ష్యాన్ని గుర్తించి క్షిపణిని ప్రయోగించిన అనంతరం సైనికుడు అదే ప్రాంతంలో ఉండాల్సిన అవసరం తగ్గుతుంది. ట్యాంకుల పైభాగంలోని తక్కువ రక్షణ ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ వ్యవస్థను ఒక సైనికుడు మోసుకెళ్లే విధంగా రూపొందించారు. వివిధ రకాల రక్షణ పరిస్థితుల్లో వినియోగించేందుకు దీనిలో ప్రత్యేక సాంకేతికతలు ఉన్నాయి.

**సరిహద్దుల్లో అదనపు బలం**

చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో సాయుధ వాహనాల ముప్పును ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఇటువంటి ఆయుధ వ్యవస్థలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో తేలికపాటి ట్యాంకులు, ఇతర సాయుధ వాహనాలను ఎదుర్కోవడంలో జావెలిన్ వంటి వ్యవస్థలు కీలకంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

**స్వదేశీ క్షిపణి అభివృద్ధి కూడా కొనసాగింపు**

మరోవైపు దేశీయంగా మానవుడు మోసుకెళ్లగల యాంటీ ట్యాంక్ మార్గదర్శక క్షిపణి వ్యవస్థ అభివృద్ధి కార్యక్రమం కూడా కొనసాగుతోంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ రూపొందిస్తున్న స్వదేశీ వ్యవస్థ భవిష్యత్తులో సైన్యానికి మరింత బలాన్ని అందించనుంది.ప్రస్తుత అత్యవసర రక్షణ అవసరాలకు విదేశీ ఆయుధ వ్యవస్థల కొనుగోలు ఉపయోగపడుతుండగా, దీర్ఘకాలంలో స్వదేశీ రక్షణ ఉత్పత్తిని పెంచుకోవడమే భారత్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికాతో తాజా రక్షణ సహకారం కూడా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశముంది.

# భీమ్ రాజ్ సేన తెలంగాణ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా జాటోత్ రవి



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 31, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** భీమ్ రాజ్ సేన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా డోర్నకల్ మండలం బోడ హత్య తండాకు చెందిన జాటోత్ రవి నియమితులయ్యారు.ఈ మేరకు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో సంస్థ జాతీయ అధ్యక్షుడు కె. రాజేష్ జాటోత్ రవికి అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.తెలంగాణలో సంస్థను మరింత విస్తరించడంతో పాటు యువతను సంస్థ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, జిల్లాల నుంచి గ్రామస్థాయి వరకు యువజన విభాగాన్ని పటిష్టం చేయడం ప్రధాన బాధ్యతగా ఉండనుంది.యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు సభ్యత్వ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, సమావేశాలు, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి యువజన కమిటీలతో సమన్వయం చేసుకుంటూ సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నియామక పత్రంలో పేర్కొన్నారు.సంస్థ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువజన విభాగంలో ఐక్యత, క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజ సంక్షేమానికి కృషి చేస్తానని జాటోత్ రవి తెలిపారు. ఆయన నియామకంపై భీమ్ రాజ్ సేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.


# మిత్రుడి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కర్



**నారాయణఖేడ్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్‌జీటీ రామకృష్ణ గౌడ్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కర్ పాల్గొన్నారు.రామకృష్ణ గౌడ్ చిన్ననాటి మిత్రుడైన నగేష్ శెట్కర్ ఆయనను సన్మానించి పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ గౌడ్ అందించిన విద్యా సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, మాజీ మండల అధ్యక్షుడు మధు, పెద్దశంకరంపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జహంగీర్, పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి, సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన అందరికీ పింఛన్లు మంజూరు చేయాలి: ముద్దం నర్సింహ యాదవ్

**దరఖాస్తు పత్రాలను డిప్యూటీ కమిషనర్‌కు అందజేత**



**మల్కాజిగిరి, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 262, 264 డివిజన్లలో అర్హులైన వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వ పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ వారి పింఛన్ దరఖాస్తులను ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు.సుమారు 350 మంది పేద, అర్హులైన లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తన సొంత ఖర్చులతో వారి పింఛన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, 262, 264 డివిజన్లలో పింఛన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఇప్పటికీ పింఛన్ అందని వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళల దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు తెలిపారు.దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఆమోదం తెలిపి పింఛన్లు మంజూరు చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.

## మూసారాంబాగ్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం

### పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్





**అంబర్‌పేట్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** అంబర్‌పేట్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మరో ముందడుగు పడింది. నగరంలో నిర్మించిన ప్రతిష్టాత్మక మూసారాంబాగ్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యమంత్రితో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.మూసారాంబాగ్ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల ప్రయాణ సమయం ఆదా కానుందని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ ద్వారా అంబర్‌పేట్ పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.

## కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం

### ఢిల్లీ పరిసరాల్లో ఘటన.. డ్రైవర్, కండక్టర్ అరెస్ట్




**ఢిల్లీ, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో కదులుతున్న స్లీపర్ బస్సులో 16 ఏళ్ల బాలికపై డ్రైవర్, కండక్టర్ సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటన ఆగస్టు 4న చోటుచేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల బాలిక కుటుంబ సభ్యులతో గొడవపడిన అనంతరం నోయిడాలోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ వద్ద ఢిల్లీ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సు ఎక్కింది.పరిచౌక్ నుంచి ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వరకు సుమారు 47 కిలోమీటర్ల ప్రయాణంలో బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బస్సు కిటికీలకు తెరలు ఉండటంతో లోపల జరుగుతున్న విషయం బయటివారికి కనిపించలేదని పోలీసులు తెలిపారు.ఘటన అనంతరం బాలికను కశ్మీరీ గేట్ బస్ స్టాండ్ వద్ద దింపివేసినట్లు సమాచారం. అనంతరం బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బస్సు వివరాల ఆధారంగా నిందితులైన డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## గ్రామ ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ ఆర్థిక అండ

### హుగ్గెల్లీలో పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి తరపున వివాహ కానుక



**జహీరాబాద్, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** గ్రామ ఆడబిడ్డల శుభకార్యాలకు అండగా నిలుస్తూ హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. హుగ్గెల్లీ గ్రామానికి చెందిన పోలీస్ ఇసాముద్దిన్ కుమార్తె వివాహం సందర్భంగా సర్పంచ్ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ ఆర్థిక సహాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజుతో పాటు గ్రామ సీనియర్ నాయకులు నర్సింహులు, నరేష్, మోముల పాండురంగారెడ్డి, అశోక్, సిద్ధారెడ్డి, కె. శ్రీనివాస్, ముస్తఫా, రాములు, కిష్టారెడ్డి, అక్బర్ తదితరులు కుటుంబ సభ్యులకు అందజేశారు.తమ కుమార్తె వివాహానికి ఆర్థికంగా అండగా నిలిచిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతో పాటు గ్రామ ప్రజల శుభకార్యాల్లో అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మూసారాంబాగ్ హై లెవల్ వంతెన ప్రారంభం

### అంబర్‌పేట-దిల్‌సుఖ్‌నగర్ మధ్య రాకపోకలకు మరింత సౌలభ్యం

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్):** నగర రవాణా వ్యవస్థకు మరో కీలక మౌలిక వసతి అందుబాటులోకి వచ్చింది. మూసీ నదిపై అంబర్‌పేట--దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో నూతనంగా నిర్మించిన మూసారాంబాగ్ హై లెవల్ వంతెనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు.సుమారు రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవున నిర్మించిన ఈ వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, చాదర్‌ఘాట్, పాతనగరం ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వంతెనను పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను



అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకు చేపట్టిన పనులకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను కూడా తిలకించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, అసదుద్దీన్ ఓవైసీ, శాసనసభ్యులు కాలేరు వెంకటేశ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీగణేశ్, నవీన్



యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా హైదరాబాద్‌లో రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి అవసరం పెరుగుతున్న నేపథ్యంలో మూసారాంబాగ్ హై లెవల్ వంతెన ప్రారంభం స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా మారనుంది.

# డ్రగ్స్ రహిత భారత్‌కు అందరూ భాగస్వాములు కావాలి

### యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే దేశ భవిష్యత్తుకు కీలకం: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్):** దేశ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం అత్యంత ముఖ్యమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడమే కాకుండా దేశ అభివృద్ధిపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడుతూ డ్రగ్స్ రహిత భారతదేశం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత తమ శక్తి, ప్రతిభను సానుకూల దిశలో వినియోగించినప్పుడే దేశ ప్రగతి మరింత వేగంగా సాధ్యమవుతుందని తెలిపారు.యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన పెంచడంలో కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువతతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రభావం చూపే కంటెంట్ సృష్టికర్తలు కూడా ముందుకు రావాలని కోరారు.తమ సందేశాలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతలో అవగాహన పెంచాలని ప్రధాని సూచించారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే మత్తు పదార్థాల రహిత, ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.అదేవిధంగా పరిశుభ్రత కూడా ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి



పౌరుడు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# 'ఇరుముడి' అంటే ఏమిటి? అయ్యప్ప భక్తులకు ఎందుకు అంత పవిత్రం?

### శబరిమల యాత్రలో ఇరుముడి ప్రత్యేకత ఇదే

**శబరిమల, ఆగస్టు 31 (హైదరాబాద్ పల్స్):** అయ్యప్ప దీక్షలో ఇరుముడికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమలకు వెళ్లే భక్తులు తలపై ధరించి తీసుకెళ్లే పవిత్ర మూటనే ఇరుముడి అంటారు. రెండు భాగాలతో ఉండటం వల్ల దీనికి 'ఇరుముడి' అనే పేరు వచ్చింది.ఇరుముడిలో ప్రధానంగా రెండు భాగాలు ఉంటాయి. ముందుభాగాన్ని మున్ముడి, వెనుక భాగాన్ని పిన్ముడి అని పిలుస్తారు. మున్ముడిలో అయ్యప్ప స్వామికి సమర్పించాల్సిన నెయ్యి కొబ్బరికాయతో పాటు ఇతర పూజా సామగ్రిని ఉంచుతారు. వీటిలో నెయ్యి కొబ్బరికాయకు ప్రత్యేక ప్రాధాన్యం



ఉంటుంది.ఇక పిన్ముడిలో శబరిమల యాత్ర సమయంలో భక్తుడికి అవసరమయ్యే వస్తువులను ఉంచుతారు. ఈ రెండు భాగాలను కలిపి ఇరుముడిగా తయారు చేసి భక్తులు తలపై ధరించి యాత్ర సాగిస్తారు.అయ్యప్ప దీక్షలో భాగంగా మాల ధరించి నియమ నిష్ఠలను పాటిస్తున్న భక్తులు ఇరుముడిని ధరించి శబరిమల యాత్రకు బయలుదేరుతారు. ఇరుముడితో శబరిమలకు చేరుకున్న భక్తులు ఆలయంలోని పవిత్రమైన 18 మెట్లను ఎక్కడం అయ్యప్ప యాత్రలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తారు.ఇరుముడి కేవలం యాత్రలో తీసుకెళ్లే మూట మాత్రమే కాదు. భక్తి, నియమం, సమర్పణ భావానికి ప్రతీకగా అయ్యప్ప భక్తులు దీనిని భావిస్తారు. తన మనసు, ఆలోచనలు, కర్మలను స్వామికి అంకితం చేస్తున్నాననే ఆధ్యాత్మిక భావనతో భక్తులు ఇరుముడిని తలపై ధరించి శబరిమల యాత్రను కొనసాగిస్తారు.స్వామియే శరణం అయ్యప్ప!

## మహాదేవపూర్ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బీర్ల ఐలయ్య ప్రత్యేక పూజలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహాదేవపూర్ గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో



జీవించాలని, నియోజకవర్గ ప్రజలపై స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.మహాదేవపూర్ గ్రామంలోని ఈ పురాతన ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చందా రమేష్ ను సత్కరించిన సర్పంచ్ జన్నపల్లి బాలరాజ్ రెడ్డి



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఉద్యోగ పదవి విరమణ పొందిన రాజపేట మండల విద్యాధికారి చందా రమేష్ కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం మల్లగూడెం పాఠశాలలోని విద్యార్థుల ఇబ్బందులను చూసి చలించిన రాజపేట మండల విద్యాధికారి చందా రమేష్ దయాది హృదయంతో పాఠశాల విద్యార్థులు కూర్చోవడానికి 12 డిస్క్ బెంచ్ లను ఎన్నో ఇబ్బందులు ఉన్నా అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన సర్పంచ్ జన్నపల్లి బాలరాజ్ రెడ్డి, ఈ సందర్భంగా రాజపేట మండల విద్యాధికారి చందా రమేష్ కు చిరు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ మరియు గ్రామ సర్పంచ్ జన్నపల్లి బాలరాజ్ రెడ్డి, ఉప సర్పంచ్ రెడ్డబోయిన కవిత, మరియు వార్డ్ సభ్యులు తోటి ఉపాధ్యాయులు ఉదయ్ కుమార్, అంగన్వాడి టీచర్ మాలి అరుణ, మాజీ ప్రజాప్రతినిధులు. పాఠశాల దాతలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సిపిఎస్ అంతం గ్రామ పాలన అధికారుల పంతం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : సిపిఎస్ ను రద్దుచేసి, ఓపిఎస్ ను అమలు చేయుటకు సెప్టెంబర్ 1,విద్రోహ దినముగా ప్రకటించిన ఉద్యోగ జేఏసీ ఆదేశాలను అమలు చేయాలి అని గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ పిలుపు ఇచ్చారు. సిపిఎస్ అనే మహమ్మారి వలన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం భవిష్యత్తు అంధకారమయం కానున్నది, సాక్షాత్తు ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేస్తామని తెలిపిన సంఘటనలు ఉన్నాయి. కానీ రెండున్నర సంవత్సరాలు పైబడిన నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు, ఉద్యోగులు మన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తప్పకుండా ఓపిఎస్ అమలు చేయుటకు ప్రతి ఒక్కరం కంకణ బద్ధులమై ఈ సెప్టెంబర్ 1 విద్రోహ దిన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరి విడనాడి, ఉద్యోగులు ప్రభుత్వంలో, ప్రజలలో అంతర్భాగంగా చూసి, ఉద్యోగుల న్యాయమైన, తమ హక్కుల సాధన కోసం, సాధించేంతవరకు రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేసినట్లయితే ఉద్యోగుల ఆర్థిక మూలాలు బలపడి ఉద్యోగుల కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి, ఈ సమాజంలో గౌరవంగా జీవించటానికి దోహదపడుతుంది. కావున ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 01 తేదీ పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతున్నాము అని అన్నారు.



# డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అదజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి, సింగనగూడెంలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్లను భువనగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తి చేసి ఆదివారం ఘనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావు కలిసి ఘనంగా ప్రారంభించి లబ్ధిదారులకు ఇళ్లను అందజేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటిని పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే చొరవ, కృషి వల్లనే సింగనగూడెం డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తయ్యాయని, భువనగిరి పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో ముందుకు వెళ్తామని, పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని అన్నారు. జేసీ భాస్కర్ రావు మాట్లాడుతూ...ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా ఇళ్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగెళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఆవేస్ చిస్తి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ చైర్మన్లు, పట్టణ కాంగ్రెస్ మరియు మండల కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వంగపల్లిలో పర్మినెంట్ బస్ స్టాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**వంగపల్లి ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం, వంగపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తూ గ్రామంలో పర్మినెంట్ బస్ స్టాప్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడేలా బస్ స్టాప్ పాయింట్‌ను ఏర్పాటు చేసి, బస్సు సర్వీసును ప్రారంభించారు. వంగపల్లి గ్రామానికి పర్మినెంట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరగా, వారి విజ్ఞప్తిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారంతో వంగపల్లి గ్రామంలో పర్మినెంట్ బస్ స్టాప్ పాయింట్ ఏర్పాటు చేసి స్వయంగా బస్సు నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ప్రజల అవసరాలు, సమస్యలను పరిష్కరించడమే ప్రజాప్రతినిధిగా తన ప్రధాన బాధ్యత అని అన్నారు. వంగపల్లి గ్రామ ప్రజలు చాలా కాలంగా కోరుతున్న బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇకపై గ్రామ ప్రజలు బస్సుల కోసం ప్రధాన రహదారులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే బస్సు ఎక్కే అవకాశం కల్పించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రైతులు, వ్యాపారులు తదితరులకు ఈ బస్ స్టాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వంగపల్లి ప్రజల కోరిక మేరకు బస్ సర్వీసును ఏర్పాటు చేసి, వారి కోరికను నెరవేర్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పర్మినెంట్ బస్ స్టాప్ ఏర్పాటు కావడంతో వంగపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఎమ్మెల్యే చొరవను గ్రామస్తులు అభినందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆలేరు నియోజకవర్గంలో రవాణా సౌకర్యాల విస్తరణకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు.




# చేయూత పెన్షన్ గడువు పొడిగించాలి

**ఎంఈఎఫ్ జిల్లా నాయకులు ఇంజ మహేష్ మాదిగ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన నిరుపేదలకు అందిస్తున్నటువంటి చేయుత పింఛన్ గడువును ప్రభుత్వం వెంటనే పొడిగించాలని, ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు ఇంజ మహేష్ మాదిగ కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ..



అర్హులైన చదువురాని నిరుపేద కుటుంబానికి చెందిన ప్రజలు చేయూత పెన్షన్ కు కావలసిన సర్టిఫికెట్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో చాలామంది కుల దృవీకరణ ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ సదరం సర్టిఫికెట్ తీసుకోవడం ఆలస్యం అవుతున్నది. ఇలాంటి సర్టిఫికెట్స్ ఎమ్మార్వో ఆఫీసులో గాని, ఇతర కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడం, కొందరు బిజీగా ఉండడంవల్ల అర్హులైన నిరుపేద కుటుంబాలు ఈ పథకాన్ని అందుకోలేకపోతున్నాయి. కావున ప్రభుత్వం ఆలోచించి గడువును పెంచాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

# తమిళనాడు సీఎంను కలిసిన ఎంపీ చామల




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** చెన్నైలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టడీ టూర్ లో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పట్టణాభివృద్ధికి సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చించిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత తమిళనాడు సీఎం విజయ్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అంశాలపై సీఎం విజయ్ తో చర్చించిన ఎంపీ చామల కిరణ్ రెడ్డి



# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి సట్టు తిరుమలేష్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**

యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం ఎంపీడీవో కార్యాలయంలో గత మూడు వారాల నుండి అర్జీలు పెట్టుకుంటే ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు అనే సమాచారం మేరకు రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రోజు వెళ్లి అధికారులను అడగగా అర్జీలు తీసుకున్నామని చెప్పారని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు. ఈ సందర్భంగా సట్టు తిరుమలేష్ మాట్లడుతూ... అర్జీలు తీసుకుంటున్నారు అర్జీ దారుల ఎ ఒక్కరీ సమస్యను కూడా పరిష్కరించలేదనీ కాబట్టి ఇది ప్రజలను మభ్యపెట్టడానికి తప్ప వేరే కాదనీ గ్రీవెన్స్ డే అని పెట్టి త్వరితగతిన ప్రజల సమస్యలను పరిష్కరించకపోవడం సిగ్గు చేటని అన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి తప్ప పరిష్కారాలు చూపడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను వెంటనే వాటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్ర గోకుల జస్వంత్, సర్పంచి పయ్యావుల ఎల్లయ్య, మాజీ కోపరేట్ బ్యాంక్ డైరెక్టర్ నాగరాజ్, సర్పంచ్ గుంటి కృష్ణ, చెరుకు కనకయ్య, మాజీ సర్పంచ్ బొంగోని ఉప్పలయ్య, గ్రామశాఖ అధ్యక్షులు ములుగు సోమలింగం, రామిండ్ల నరేందర్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో బిఆర్ఎస్ మండల పార్టీ సమావేశం



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ఆదేశానుసారం నిరసన కార్యక్రమాలపై మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సట్టు తిరుమలేష్, గుంటి మధుసూదన్ రెడ్డి, గోపగాని యాదగిరి గౌడ్, మర్ల నాగరాజు, బెడిదే వీరేశం, రామిన్ల నరేందర్, ఎర్రగోకుల జస్వంత్, సందిల వెంకటేశం బొంగుని ఉప్పలయ్య, కర్ణాకర్ రెడ్డి, భూపతి, కిషన్, కోయ బాలరాజు, మోత్కుపల్లి బాలకృష్ణ, వరిమట్ల బాలకృష్ణ, తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# రిపోర్టర్ వలిని పరామర్శించిన టీజెఏ జిల్లా అధ్యక్షుడు షానూర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలానికి చెందిన సూర్య దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ నాగేల్లి వలి



తండ్రి నాగేల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, మీడియా అక్రిడెషన్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షానూర్ బాబా, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వము కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వారితోపాటు టీజెఏ ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి యానాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.